Andhra Jyothy DT-09/05/18

# మెట్రోకు ఆస్తుల సేకరణ త్వరగా పూర్తి చేయండి

- వేగంగా మెట్రో పనులు జరగాలి

- మెట్రోపై స్పెషల్ టాస్క్‌ఫోర్సు సమావేశంలో సీఎస్ ఎస్.కె.జోషి

హైదరాబాద్ సిటీ, మే 8 (ఆంధ్రజ్యోతి): మెట్రో రైలు ప్రాజెక్టు కోసం పెండింగ్‌లో ఉన్న ఆస్తుల సేకరణను త్వరగా పూర్తి చేయాలని, ఇప్పటికే మెట్రో రైలు మొదటి దశను ఈ ఏడాది చివరి కల్లా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, దానికి అనుగుణంగా పనులు చేపట్టేందుకు అన్ని శాఖలు సహకరించాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ ఎస్.కె.జోషి ఉన్నతాధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో మెట్రో రైలు ప్రాజెక్టుపై స్పెషల్ టాస్క్‌ఫోర్సు సమావేశాన్ని నిర్వహించారు. సీఎస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆస్తుల సేకరణపై ప్రధానంగా చర్చించారు. హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఆస్తుల సేకరణపై రూపొందించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను పరిశీలించారు. మెట్రో కారిడార్-2లో జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ వరకు జరుగుతున్న పనుల్లో సుమారు 131 ఆస్తుల సేకరణ పూర్తి చేయాల్సి ఉందని మెట్రో అధికారులు సీఎస్‌కు వివరించారు. అదేవిధంగా ఎంజీబీఎస్ వద్ద మెట్రో ప్రాజెక్టు కోసం రజక సంఘం ఇచ్చిన స్థలానికి బదులుగా ఉప్పల్-భగాయత్ లేఅవుట్‌లో 2,290 గజాల స్థలాన్ని కేటాయించినట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా బడీచౌడీ, సుల్తాన్‌బజార్, కోఠి ప్రాంతాల్లోనే సుమారు 131 ఆస్తులను సేకరించాల్సి ఉందని వివరించారు. ఇతర ప్రభుత్వ శాఖలైన జీహెచ్ఎంసీ, ఆర్టీసీ, హెచ్ఎండీఏలకు చెందిన ఆస్తులను స్వాధీనం చేయాల్సి ఉంది. వీటిలో అమీర్‌పేట ఇంటర్‌చేంజ్ మెట్రో స్టేషన్ వద్ద మల్టీ లెవల్ పార్కింగ్ కాంప్లెక్సు నిర్మాణం కోసం అవసరమైన 1,288 గజాల హెచ్ఎండీఏ స్థలాన్ని ఇప్పటికే హెచ్ఎంఆర్‌కు అప్పగించామని అధికారులు తెలిపారు. అనంతరం సీఎస్ ఉన్నతాధికారులనుద్దేశించి మాట్లాడుతూ మెట్రో రైలు ప్రాజెక్టు వేగంగా పూర్తి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని, దానికి అనుగుణంగా అన్ని శాఖల అధికారులు పూర్తిగా సహకరించాలని సూచించారు. సమావేశంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు యోగితారాణా, రఘునందన్‌రావు, ఎం.వి.రెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఎస్ ఎస్.కె.జోషి